ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి

5



పార్వతీపురం మన్యం

జిల్లా వార్తలు

శుక్రవారం 10 మే 2024



'మా భవిష్యత్ కోసం మీరు అవసరం' అంటూ చంద్రబాబుకు చార్ట్ ఇస్తున్న బాలిక



సభకు హాజరైన ప్రజలు, కూటమి శ్రేణులు

అవినీతి, ఇసుక దందా

- వైసీపీని ఇంటిని పంపించండి
- కూటమి అభ్యర్థులను గెలిపించండి
- దళిత,గిరిజనుల ద్రోహి.. రాష్ట్రానికి పట్టిన శని జగన్
- కురుపాం నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా
- టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు

(పార్వతీపురం, మే9 (ఆంధ్రజ్యోతి)/ కురుపాం/ గుమ్మలక్ష్మీపురం/ కొమరాడ/ గరుగుబిల్లి/ జియ్యమ్మవలస)



సీతంపేట యువకుడు అందించిన నాగలితో చంద్రబాబు



మాట్లాడుతున్న టీడీపీ అధినేత చంద్రబాబు పక్కన కురుపాం ఎమ్మెల్యే అభ్యర్థి తోయక జగదీశ్వరి, అరకు ఎంపీ అభ్యర్థి కొత్తపల్లి గీత

'వైసీపీని ఇంటికి పంపించండి.. కురుపాంలో అవినీతి ఎమ్మెల్యేను చిత్తుగా ఓడించండి.. కూటమి అభ్యర్థులను గెలిపించండి ' అని తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు పిలుపు నిచ్చారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం ఆయన కురుపాం వచ్చారు. ఈ సందర్భంగా రావాడ జంక్షన్ వద్ద నిర్వహించిన ప్రజాగళం సభలో చంద్రబాబు మాట్లాడుతూ..

ఐదేళ్లలో వైసీపీ ఎమ్మెల్యే చేసింది ఇవే...

'కురుపాం సిట్టింగ్ ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి అవినీతి, ఇసుక దందాలు ద్వారా అధికంగా సంపాదించుకున్నారు. నియోజకవర్గ ప్రజలకు చేసిన మేలు ఏమీ లేదు. పాదయాత్ర సమయంలో కురుపాం నియోజకవర్గ ప్రజలకు జగన్ ఎన్నో హామీలు ఇచ్చారు. వాటిల్లో ఒక్కటి కూడా నెరవేర్చలేదు. ఈ ప్రాంత వాసులను మోసం చేశారు.' అని చంద్రబాబు తెలిపారు. 'కురుపాం నియోజకవర్గం నుంచి నిజమైన ఆదివాసీ గిరిజన బిడ్డ తోయక జగదీశ్వరిని టీడీపీ ఇన్‌చార్జిగా పెట్టి పార్టీ టిక్కెట్ ఇచ్చాం. ఇది గిరిజనులపై టీడీపీకి ఉన్న అభిమానం. సైకిల్ గుర్తుపై ఓటు వేసి జగదీశ్వరిని, కమలం గుర్తుపై ఓటు వేసి అరకు ఎంపీ అభ్యర్థి కొత్తపల్లి గీతను భారీ మెజార్టీతో గెలిపించండి' అని ఆయన పిలుపునిచ్చారు.

అధికారంలోకి రాగానే..

'కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే కురుపాం నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తాం. పూర్ణపాడు-లాబేసు వంతెన నిర్మాణం పూర్తి చేస్తాం. నాగావళి ఎత్తిపోతల పథకం ద్వారా గరుగుబిల్లి, జియ్యమ్మవలస, కొమరాడ మండలాలకు సాగునీరు అందిస్తాం. గుమ్మిడిగెడ్డ మినీ రిజర్వాయర్ నిర్మిస్తాం. తోటపల్లి-గుణుపూర్ మధ్య వంతెన నిర్మిస్తాం. గుమ్మలక్ష్మీపురంలో జీడి పరిశ్రమ ఏర్పాటు చేస్తాం. పామాయిల్ రైతులను ఆదుకుంటాం. గిరిజనులకు డోలీ కష్టాలు తీరుస్తాం. గిరిజన ప్రాంతాల్లో పూర్తి స్థాయిలో మౌళిక సదుపాయాలు కల్పిస్తాం. ఏనుగుల బెడదతో పాటు తాగు, సాగునీటి సమస్యలు పరిష్కరిస్తాం. తోటపల్లి ప్రాజెక్టు పరిధిలోని పలు గ్రామాలకు మిగులు జలాలు అందించేందుకు చొరవ చూపుతాం. రూ. 45 కోట్లతో సుమారు 8 వేల ఎకరాలకు సాగునీరందిస్తాం. టీడీపీ ప్రభుత్వ హయాంలో ఎత్తిపోతల పథకాలకు అవసరమైన నిధులు మంజూరు చేస్తే వైసీపీ ప్రభుత్వం పనుల నిర్వహణకు ఆటంకం కల్పించి రైతులను మోసం చేసింది. తోటపల్లి ప్రాజెక్టు నుంచి అధికంగా నీరు సముద్రంలో కలుస్తుంది. ఆ నీరు వృథా కాకుండా అవసరమైన ప్రణాళికలు రూపొందిస్తాం. జంఝావతి ప్రాజెక్టు పరిధిలోని సమస్యలు పరిష్కస్తాం. ముఖ్యమంత్రి జగన్.. సాగునీటి ప్రాజెక్టులను నిర్వీర్యం చేశారు. జగన్‌లా హామీలు ఇచ్చి మరిచిపోను. చెబితే అక్షరాలా నిజం చేస్తా.' అని చంద్రబాబు హామీ ఇచ్చారు.

జీవో-3 పునరుద్ధరిస్తాం..

'గిరిజనులకు మేలు చేసిన విధంగా మేము గతంలో తీసుకొచ్చిన జీవో నెంబరు-3ని వైసీపీ ప్రభుత్వం రద్దు చేసింది. స్థానికులకు ఉద్యోగాలు లేకుండా చేసింది. కూటమి ప్రభుత్వంలో జీవో-3ని పునరుద్ధరిస్తాం. గిరిజనులకు మేలు చేసిన విధంగా చర్యలు తీసుకుంటాం' అని చంద్రబాబు వెల్లడించారు.

గిరిజన, దళితుల ద్రోహి జగన్

'వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత గిరిజనులు, దళితులు, బీసీలు, ఇతర సామాజిక వర్గాలకు జగన్ తీవ్ర అన్యాయం చేశారు. గత టీడీపీ ప్రభుత్వం కాలంలో గిరిజన విద్యార్థుల కోసం ప్రత్యేకంగా పాఠశాలలు, వైటీసీలు ఏర్పాటు చేశాం. ఉపాధి కల్పనకు చర్యలు చేపట్టాం. గిరిజనులు, దళితులు, ఇతర సామాజిక వర్గాల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేశాం. అయితే వైసీపీ ప్రభుత్వం పాలనా పగ్గాలు చేపట్టిన తర్వాత ఆ పథకాలన్నింటినీ రద్దు చేసింది. గిరిజనుల కోసం గతంలో ఎన్టీఆర్ నెలకొల్పిన ఐటీడీఏలను నిర్వీర్యం చేశారు. వైసీపీ పాలనలో ఎస్టీ, ఎస్సీ, బీసీలపై దాడులు పెరిగిపోయాయి. నవరత్నాలు అంటూ అన్ని వర్గాలనూ మోసం చేశారు. జగన్.. ఈ రాష్ట్రానికి పట్టిన కేన్సర్ గడ్డ. గిరిజన, దళితుల ద్రోహి. దగాకోరు జగన్‌ను ఇంటికి పంపించి.. వైసీపీని భూ స్థాపితం చేద్దాం.' అని చంద్రబాబు పిలుపునిచ్చారు.

ఉపాధి కల్పిస్తాం..

'అధికారంలోకి రాగానే 20 లక్షల మందికి ఉపాధి కల్పిస్తాం. ఇంటి నుంచే పనిచేసుకునేలా చర్యలు చేపడతాం. ప్రజల భవిష్యత్‌కు బంగారు బాట వేస్తాం.' అని చంద్రబాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ శత్రుచర్ల విజయరామరాజు, టీడీపీ కురుపాం, పార్వతీపురం ఎమ్మెల్యే అభ్యర్థులు తోయక జగదీశ్వరి, బోనెల విజయ చంద్ర, అరకు ఎంపీ అభ్యర్థి కొత్తపల్లి గీత, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వైరిచర్ల వీరేష్ చంద్రదేవ్, అరకు ఇన్‌చార్జి కె.శ్రావణ్, టీడీపీ నాయకులు డి.రామకృష్ణ, లక్ష్మణరావు, కె.రంజిత్‌కుమార్, కొండయ్య, సుధ, ఉదయ పాత్రుడు, మధుసూదనరావు, రాంబాబు, సురేష్, సీతారాం, పైడిరాజు జనసేన నాయకుడు మల్లేశ్వరరావు, కూటమి శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలకు సర్వం సిద్ధం: కలెక్టర్

పార్వతీపురం, మే9 (ఆంధ్రజ్యోతి): ప్రశాంత ఎన్నికల నిర్వహణకు సర్వం సిద్ధం చేయాలని కలెక్టర్ నిశాంత్‌కుమార్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ నుంచి వీడియోకాన్ఫరెన్స్ ద్వారా పార్వతీపురం మన్యం జిల్లా, అల్లూరి సీతారామరాజు జిల్లాలకు చెందిన సహాయ రిటర్నింగ్ అధికారులతో సమీక్షించారు. 13న జరిగే పోలింగ్‌కు సంబంధించి సామగ్రి పంపిణీ, రవాణా రూట్లు తదితర అంశాలపై దృష్టిసారించాలన్నారు. హింసాత్మక సంఘటనలకు తావులేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఎన్నికల సామగ్రిని ముందుగానే తనిఖీ చేసుకోవాలన్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు పోలింగ్ కేంద్రాల్లో విధిగా అన్ని వసతులు ఉండాలని తెలిపారు. ఓటింగ్ పూర్తయిన తర్వాత తిరిగి వచ్చే పోలింగ్ సామగ్రి, నిర్దేశిత ఫారాలను తనిఖీ చేసి తీసుకోవాలన్నారు. స్ట్రాంగ్ రూమ్‌లో ఈవీఎంలను భద్రపర్చడంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పక్కాగా ఏర్పాట్లు చేయాలని, ఎక్కడా ఎటువంటి సమస్యలు తలెత్తకుండా చూడాలని ఆదేశించారు. జేసీ శోభిక, ఇన్‌చార్జి డీఆర్వో కేశవ నాయుడు, ఏడు నియోజక వర్గాల రిటర్నింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

గుర్తింపు కార్డు తప్పనిసరి

ఓటు వేయడానికి వచ్చేవారికి విధిగా గుర్తింపు కార్డు ఉండాలని కలెక్టర్ తెలిపారు. 13 రకాల గుర్తింపు కార్డుల్లో ఏదో ఒకదానికి తీసుకురావొచ్చని చెప్పారు ఓటరు కార్డు కలిగిన వారు దానిని పోలింగ్ కేంద్రాల్లో గుర్తింపు కార్డుగా చూపించి ఓటు హక్కు వినియోగించుకోవచ్చని స్పష్టం చేశారు. ఆధార్‌కార్డు, జాబ్‌కార్డు, పాస్‌బుక్, హెల్త్ ఇన్సూరెన్స్, స్మార్ట్‌కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, పాన్‌కార్డు, స్మార్ట్‌కార్డు, పాస్‌పోర్టు, ఫొటో కలిగిన పెన్షన్ డాక్యుమెంట్‌ను కూడా చూపించి ఓటు వేయొచ్చన్నారు. ఎన్నికల సిబ్బంది పంపిణీ చేస్తున్న ఓటరు స్లిప్‌లు కేవలం పోలింగ్ కేంద్రం వివరాలు తెలియజేయానికి మాత్రమేనని వెల్లడించారు. వాటిని గుర్తింపుకార్డుగా పరిగణించబోమన్నారు. పోలింగ్ కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు, ఎటువంటి ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకెళ్లకూడదని తెలిపారు.



మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

గర్భిణుల ఆరోగ్యాన్ని పర్యవేక్షించాలి

- ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో విజయపార్వతి

వీరఘట్టం: హైరిస్క్ గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక పర్యవేక్షణ ఉండాలని ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో కె.విజయపార్వతి ఆదేశించారు. గురువారం ఆమె వీరఘట్టం పీహెచ్‌సీని సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. అనంతరం గర్భిణులకు నిర్వహిస్తున్న వైద్య పరీక్షలను పరిశీలించారు. సకాలంలో అల్ట్రా, టిఫా స్కానింగ్ జరిగేలా చూడాలని ఆదేశించారు. ప్రసవాలకు నెల ముందుగానే బర్త్ ప్లానింగ్ చేయాలని ఆమె సూచించారు. వేసవి రీత్యా జాగ్రత్తలను పాటించాలని, అందుబాటులో ఓఆర్ఎస్ ఉంచాలని తెలిపారు. ఆరోగ్య సలహాలు తెలియజేసే కిల్కారి సందేశాన్ని ప్రతి గర్భిణీ వినాలన్నారు. పీహెచ్‌సీలో సాధారణ ప్రసవాలు జరగాలని సూచించారు. అంగన్‌వాడీ సిబ్బంది గర్భిణుల పోషణ, బరువు నమోదుపై దృష్టి సారించాలని ఆమె ఆదేశించారు. వైద్యాధికారులు పి.ఉమామహేశ్వరి, ప్రదీప్, డిప్యూటీ డీఎంవో యోగేశ్వర్‌రెడ్డి, ఈవో జగన్నాథరావు, సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



వైసీపీలో కలవరం


- ఎన్నడూ లేనివిధంగా పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ
- కేంద్రాల్లో బారులుదీరి ఓటు హక్కు వినియోగించుకున్న ప్రభుత్వ ఉద్యోగులు
- కూటమి వైపే మొగ్గు చూపినట్లు అధికార పార్టీ నేతల సందేహం
- ప్రలోభాలతో ఎర వేసినా.. తలొంచని ఉద్యోగ, ఉపాధ్యాయులు

(పార్వతీపురం-ఆంధ్రజ్యోతి)

సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా జిల్లాలో ప్రారంభమైన పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియకు ఎన్నడూ లేని విధంగా ఉద్యోగులు ఓటెత్తారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే వారంతా భారీగా ఫెసిలిటేషన్ కేంద్రాలకు వెళ్లి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మొత్తంగా 95 శాతం మేర ఓట్లు పోలైనట్లు సమాచారం. జిల్లాలో ఈ నెల 5 నుంచి పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ ప్రారంభ మైన విషయం తెలిసిందే. ఉద్యోగుల వినతి మేరకు ఈ నెల 9 వరకు ఈ ప్రక్రియను పొడిగించారు. కాగా జిల్లాలోని నాలుగు ఫెసిలిటేషన్ కేంద్రాల్లో ఉద్యోగులందరూ క్యూలైన్లలో గంటలతరబడి నిరీక్షించి మరీ ఓటు వేశారు. కాగా ప్రతిసారి గుంభనంగా జరిగిపోయే పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ ఈసారి భిన్నంగా జరగడం.. ఉద్యోగులు పెద్దఎత్తున ఓటు హక్కును వినియోగించు కోవడంతో వైసీపీ వర్గాలు కలవరపడుతున్నాయి. అధికశాతం ఉద్యోగులు కూటమి వైపు మొగ్గు చూపారనే అనుమానంతో వారిని కూడా ప్రలోభ పెట్టేందుకు కొంతమంది వైసీపీ నాయకులు ప్రయత్నించారు. శిబిరాలను ఏర్పాటు చేసి.. తాయిలాలతో ఎర వేసి ఉద్యోగుల ఓట్లకు తంటాలు పడ్డారు. అయితే వారికి చుక్కెదురైంది. అత్యధిక శాతం పోస్టల్ బ్యాలెట్లు ఓటర్లు వారికి తలవంచలేదు. పోలింగ్ కేంద్రాలకు భారీగా తరలివచ్చి వారికి నచ్చిన వారికి ఓటు వేశారు.

అధికార పార్టీ నేతల్లో గుబులు..

తమ సమస్యలను పరిష్కరించాలని, హామీలు నెరవేర్చాలని గత ఐదేళ్ల కాలంలో ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులు ఎన్నోసార్లు వైసీపీ ప్రభుత్వాన్ని కోరారు. అయినా సర్కారు స్పందించలేదు. దీంతో వారు రోడ్డెక్కారు. అన్ని శాఖల ఉద్యోగులు, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ సిబ్బంది , అంగన్‌వాడీలు, ఆశాలు సైతం నిరసన బాట పట్టారు. ఈ తరుణంలో మొక్కుబడిగానే స్పందించిన రాష్ట్ర సర్కారు ఉద్యోగులకు న్యాయం చేయలేదు. గతంలో ఇచ్చిన హామీలను సైతం నేరవేర్చకపోవడంతో ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులు, పలు సంఘాల నాయకులు వైసీపీ సర్కారుపై ఆగ్రహంతో ఉన్నారు. ప్రధానంగా సీపీఎస్ రద్దు , ఇతర ఆర్థిక బకాయిల విషయంలో జగన్ హామీ ఇచ్చి.. మడమ తిప్పారని, తమను మోసం చేశారని వారు కొంతకాలంగా ఆవేదన వ్యక్తం చేస్తున్నా.. సర్కారు ఏ మాత్రం పట్టించుకోలేదు. సరికదా ఉద్యోగ, ఉపాధ్యాయులపై పనిభారం మోపింది. యాప్‌లతో ఇబ్బందులకు గురిచేసింది. ప్రశ్నించిన వారిని గొంతునొక్కేందుకు యత్నించింది. ఆందోళనలకు దిగిన వారికి నోటీసులు, గృహ నిర్బంధాలు, అక్రమ కేసులతో భయాందోళనలకు గురిచేసింది. మరోవైపు టీచర్లను ఎన్నికల్ల విధుల దూరంగా ఉంచాలని వైసీపీ సర్కారు వ్యూహరచన చేసింది. దీంతో ఉద్యోగ, ఉపాధ్యాయులు వాస్తవాలను గ్రహించారు. సర్కారుకు గట్టిగా బుద్ధి చెప్పాలని నిర్ణయించుకున్నారు. అందుకే వారంతా పోస్టల్ బ్యాలెట్‌కు బారులుదీరారనే వ్యాఖ్యలు లేకపోలేదు. కాగా అత్యధిక శాతం ఉద్యోగులు కూటమి వైపు మొగ్గు చూపారని కొంతమంది వైసీపీ నేతలు భావిస్తున్నారు. కూటమికి అనుకూలంగా పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ జరిగిందనే ప్రచారం విస్తృతంగా జరుగుతుండడంతో ఆ పార్టీ శ్రేణుల్లో కలవరం మొదలైంది.



వారి ఓట్లకు గాలం..

పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ జరుగుతున్న సమయంలో ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయుల ఓట్లను గాలం వేసేందుకు జిల్లాలోని రెండు నియోజకవర్గాల్లో గట్టి ప్రయత్నాలు జరిగాయి. ఆయా చోట్ల పోస్టల్ బ్యాలెట్ ఉన్న ఓటరుకు రూ. రెండు నుంచి రూ.నాలుగు వేలు ఇచ్చేందుకు కొందరు వైసీపీ నేతలు ప్రయత్నించారు. అయితే అత్యధిక శాతం ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులు వాటిని సున్నితంగా తిరస్కరించారు. కాగా జిల్లాలో అక్కడక్కడా బలవంతపు ప్రలోభాలు జరిగినట్టు సమాచారం. వైసీపీకి అనుకూలంగా ఓట్లు వేయాలని అంగన్‌వాడీలపైనా ఆ పార్టీ నాయకులు తీవ్ర ఒత్తిడి తీసుకొచ్చారు. అయినప్పటికీ మెజార్టీ ఉద్యోగులు వారికి నచ్చిన పార్టీకే ఓట్లు వేసినట్లు తెలిసింది. ఈ ఎన్నికల్లో గెలిచేందుకు ఏ ఒక్క అవకాశాన్ని వదులుకోకూ డదని భావించిన వైసీపీ నేతలు ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులపైన కూడా గురిపెట్టి భంగపడ్డారు. వారి ఓట్లను తమకు తమకు అనుకూలంగా మలుచుకోవాలని ప్రయత్నించినప్పటికీ చేదు అనుభవమే మిగిలింది.



బానిసలం కాదు..

ప్రభుత్వ ఉద్యోగం చేస్తున్నామంటే ప్రజలకు సేవకులుగా ఉంటాం తప్ప ప్రభుత్వానికి బానిసలం కాదు. వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల కాలంలో మమ్మల్ని ఏ విధంగా చూసిందో అందరికీ తెలుసు. దీనిని ఎవరూ హర్షించరు. అందుకే మాకు నచ్చిన నాయకుడికి ఓటు వేశాం.

- ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు, పార్వతీపురం మన్యం జిల్లా

స్వేచ్ఛగా ఓటు వేశాం...

గత ఐదేళ్ల కాలంలో మా సమస్యలను వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. ఉద్యోగులపై సర్కారు వ్యవహరించిన తీరు దారుణం. నెలంతా పనిచేసి ఒకటో తేదీకి జీతాలు ఇవ్వండి మహాప్రభో' అంటూ అడుక్కోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. సీపీఎస్ రద్దు హామీ కూడా నెరవేర్చలేదు. ఓపీఎస్ అమలు చేయలేదు. ఆర్థిక బకాయిలు కూడా సక్రమంగా చెల్లించలేదు. భవిష్యత్‌లో ఇటువంటి దుస్థితి ఏర్పడకూడదనే ఎటువంటి ప్రలోభాలకు లొంగకుండా స్వేచ్ఛగా మాకు నచ్చిన వారికి ఓటు వేశాం.

- ఓ ప్రభుత్వ ఉద్యోగి, పార్వతీపురం మన్యం జిల్లా

ముగిసిన పోస్టల్ బ్యాలెట్

పార్వతీపురం, మే9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ గురువారంతో ముగిసింది. మొత్తంగా 95 శాతం మేర పోలింగ్ నమోదైంది. పాలకొండ నియోజకవర్గంలో 2009 ఓట్లకు గాను 1921 ఓట్లు పోలయ్యాయి. పార్వతీపురంలో 2,273కు గాను 2,194 మంది , కురుపాంలో 2,633 మందికి గాను 2,498 మంది , సాలూరులో 1512 ఓట్లకు గాను 1,446 మంది ఓటు వేశారు. మొత్తంగా జిల్లాలో 8,427 ఓట్లకు గాను 8,058 మంది ఓట్లు పోలైనట్లు గురువారం రాత్రి అధికారులు తెలిపారు.



పీపుల్స్ మేనిఫెస్టో

సహకార రంగాన్ని బలోపేతం చేయాలి



సాలూరు రూరల్: సహకార రంగాన్ని బలోపేతం చేయాలి. గ్రామీణ పరపతి విధానంలో ప్రాథమిక సహకార సంఘాలది ప్రధాన పాత్ర. వీటిని బలోపేతం చేస్తే గ్రామస్థాయిలో రైతులకు మేలు జరుగుతుంది. సేద్యానికి పెట్టుబడికి రైతులకు ఇబ్బంది లేకుండా పోతుంది. ఇప్పటి విధానంలో లోపాలను గుర్తించి బలోపేతానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టి సారించాలి. అప్పుడే రైతులకు మేలు జరుగుతుంది. ఈ దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆలోచించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

- పెద్దింటి మాధవరావు, మామిడిపల్లి


ఒట్టుపెట్టి ఓటేస్తే.. ఖర్చులు చెల్లిస్తాం!



విజయనగరం (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఎలాగైనా గెలిచేందుకు వైసీపీ నాయకులు రకరకాల ట్రిక్స్ ఉపయోగిస్తూ ఓటర్లను ప్రలోభాలకు గురి చేస్తున్నారు. సర్వేలన్నీ కూటమికి అనుకూలంగా ఉండటంతో రానున్న సార్వత్రిక ఎన్నికల్లో గెలిచేందుకు మద్యం, డబ్బులు విచ్చలవిడిగా పంచే పనిలో పడ్డారు. ఇందులో భాగంగా వలస వెళ్లిన ప్రతి కుటుంబాన్నీ జిల్లాకు రప్పించేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. హైదారాబాద్, విజయవాడ, రాజమండ్రి, విశాఖ వంటి నగరాల్లో పనిచేసే వారిని ఓట్లు వేసేందుకు పిలుస్తున్నారు. ఇందుకు తగ్గట్టుగా వారికి ప్రయాణ ఖర్చులంటూ ఫోన్ పే, గూగుల్ పే ద్వారా డబ్బులు పంపిస్తున్నారు. ఓటు వేసిన వారు ప్రమాణం చేస్తే రానూ పోను టిక్కెట్లే కాకుండా.. ఆ రోజు ఇతరత్రా ఖర్చులు కూడా తామే ఇచ్చుకుంటామని చెప్పుకొస్తున్నారు. కొంతమంది ప్రలోభాలకు లొంగడం లేదు. 'మీ డబ్బులు, మీ టిక్కెట్లు వద్దు.. ప్రజాస్వామ్యబద్ధంగా మా ఓటును వినియోగించుకుంటా'మని వైసీపీ నేతలకు చెప్పడంతో కంగుతింటున్నారు. మరోవైపు స్థానికంగా ఓటర్లకు మద్యం, డబ్బు పంపిణీకి కూడా తెర తీశారు.

ఓటర్లకు ఎర వేసేవారు కాదు

పెద్దల మాట



సాలూరు రూరల్: గతంలో ఎన్నికల్లో విజయం కోసం ఓటర్లకు ఎర వేసేవారు కాదు. పార్టీలు మాత్రం అభివృద్ధి చేస్తాం... జీవన ప్రమాణ స్థాయి పెంచుతామని... పేదరికం నిర్మూలిస్తామని నినాదాలు చేసేవి. విజయం కోసం ఆయాచితంగా అవి ఇస్తాం, ఇవి ఇస్తామని అనేవి కాదు. సాలూరు రెండో ఎమ్మెల్యే అల్లు ఎరుకునాయుడు అసెంబ్లీకి వెళ్లడానికి అప్పు చేసి వెళ్లిన రోజులు ఉన్నాయి. ఎమ్మెల్యేల జీతాలు తక్కువే. పోటీ చేసిన అభ్యర్థి వ్యక్తిత్వం, గుణగణాలను పరిగణనలోకి తీసుకొని ఓటు వేసేవారం. ఇప్పుడు ఎమ్మెల్యేల జీతాలు రూ.లక్షల్లో ఉన్నాయి. సమర్థులను గుర్తించి ఓటు వేస్తాను.

- బలబద్రుని కృష్ణారావు (86), సాలూరు

కొత్తవారిని కలిపేద్దాం

- పార్టీల్లో చేరికలకు అభ్యర్థుల వ్యూహాలు

(విజయనగరం)

ఎన్నికలు అనగానే కూడికలు..తీసివేతలు సహజం. అదేనండీ... అప్పటి వరకూ ఓ పార్టీలో ఉన్న వారు ప్రత్యర్థి పార్టీలో చేరితే... ప్రత్యర్థి పార్టీ వారు ఎదుటి పార్టీలో చేరడం సాధారణం. దీని వల్ల రెండు లాభాలు. ఒకటి తమ పార్టీ విధానాలు నచ్చి..చేరికలు పెరుగుతున్నాయని సంబంధిత అభ్యర్థులు చెప్పుకోవడానికి ఓ అవకాశం ఉంటుంది. రెండోది ఎదుటి పార్టీపై మానసికంగా పైచేయి సాధించినట్టు అవుతుంది. ఇక మూడోది జనం తమ పార్టీ వైపు ఆకర్షితులయ్యేలా చేసుకోవచ్చు. ప్రజల్లో కొంచెం పట్టున్న వ్యక్తులు పార్టీలో చేరితే ఆ ప్రభావం కూడా



కలసి వస్తుంది. దీంతో ప్రధాన పార్టీలు ఎదుటి వారిని తమవైపు ఆకర్షించడానికి...ఎక్కువ మందిని పార్టీలో చేర్చుకోవడానికి ప్రాధాన్యమిస్తాయి. గెలుపే లక్ష్యంగా ప్రధాన పార్టీలు పావులు కదుపుతున్నాయి. ఓవైపు విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తూనే మరోవైపు చేరికలపై దృష్టి సారిస్తున్నారు. దీనికోసం అభ్యర్థులు కొంతమందికి ప్రత్యేకంగా బాధ్యతలు అప్పగిస్తున్నారు. పల్లెలు... పట్టణాలు.. మండల స్థాయిలో ప్రజాప్రతినిధులు, కీలక ద్వితీయ శ్రేణి నాయకులు ప్రధాన పార్టీల్లో చేరుతున్నారు. ప్రజల్లో వారికి ఉన్న ఆదరణ తమకు ఓట్ల రూపంలో లబ్ధి చేకూరుస్తుందని అంచనా వేసుకుంటున్నారు. ప్రత్యర్థి పార్టీల్లో ఉన్న ప్రజాప్రతినిధులు, నాయకుల వివరాలను ఆరా తీస్తూ పార్టీలోకి వచ్చేలా చేస్తున్నారు. పార్టీలోకి వస్తామనే నేతల ఓటు బలం ఎంత? సామాజిక వర్గంలో వారికున్న బలం ఏంటి అనే అంశాల ఆధారంగా అభ్యర్థులు వారి భవిష్యత్తుకు భరోసా కల్పిస్తున్నారు. ఎన్నికల్లో గెలిస్తే పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామని... అన్ని విధాలా అండగా ఉంటామని హామీ ఇస్తున్నారు. అయితే కొన్ని చోట్ల ఈ చేరికలపై సొంత పార్టీ నాయకుల నుంచి వ్యతిరేకతలు వ్యక్తమవుతున్నాయి. కొత్త వారు చేరితే తమ ప్రాధాన్యం తగ్గుతుందనే ఆలోచనతో...అప్పటి వరకూ ఆ పార్టీలో ఉన్న వారు ఇతర పార్టీల వారి రాకను వ్యతిరేకిస్తున్నారు.


ఎవరి సర్వే వారిదే!



- సొంతంగా వివరాలు తెలుసుకుంటున్న అభ్యర్థులు
- నివేదికల ఆధారంగా వ్యూహాలు
- బెట్టింగ్‌ల కోసం కొన్ని సంస్థల సర్వేలు

(గరుగుబిల్లి)

'మన నియోజకవర్గంలో నా పరిస్థితేంటి? ఏ వర్గం ప్రజల్లోనైనా నా పట్ల వ్యతిరేకత ఉందా? ఎవరైనా నాకు వ్యతిరేకంగా పని చేస్తున్నారా? ఎవరెవరిని బుజ్జగించాలి? నియోజకవర్గంలో పార్టీలకు అతీతంగా ఓటర్లను ఎక్కువగా ప్రభావితం చేసే వ్యక్తులెవరు? ప్రచారాన్ని ఏ విధంగా నిర్వహించాలి?'... అసెంబ్లీ ఎన్నికల్లో ప్రధాన రాజకీయ పార్టీల



అభ్యర్థులంతా ఇప్పుడు ఈ అంశాలను తెలుసుకునే పనిలో పడ్డారు. ఇందుకోసం సొంతంగా సర్వేలు చేయించుకుంటున్నారు. అధిష్ఠానాలు పార్టీల తరఫున సర్వేలు చేయిస్తున్నా... అభ్యర్థులు కేవలం వాటిపైనే ఆధారపడటం లేదు. పార్టీ అధిష్ఠానాల సర్వేలు గెలుపోటములు, మరికొన్ని అంశాలకే పరిమితమవుతున్నాయి. దీంతో అన్ని అంశాలను తెలుసుకునేందుకు అభ్యర్థులు వ్యక్తిగతంగా సర్వే చేయించుకుంటూ ఎప్పటికప్పుడు సమాచారం తెలుసుకుంటున్నారు. కచ్చితంగా గెలవాలనుకునే నేతలంతా ఇలా రెండో అభిప్రాయం కోసం సర్వే సంస్థలను ఆశ్రయిస్తున్నట్లు ఏజెన్సీ వర్గాలు చెబుతున్నాయి. టీడీపీ, వైసీపీ, కాంగ్రెస్‌కు చెందిన అభ్యర్థులు ఇలా సొంతంగా సర్వే చేయించుకునేందుకు పొరుగు రాష్ట్రంలోని ఓ ప్రధాన సర్వే సంస్థను ఆశ్రయించినట్లు తెలుస్తోంది.

పార్టీలకు అదే ఆధారం

వాస్తవానికి రాష్ట్రంలోని ప్రధాన పార్టీలు టీడీపీ, వైసీపీ, కాంగ్రెస్ ప్రజానాడిని పట్టేందుకు సర్వేలనే నమ్ముకుంటున్నాయి. క్షేత్రస్థాయిలో బలాలు, బలహీనతలేంటో తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నాయి. ముఖ్యంగా అధికార వైసీపీ అయితే ఇంటెలిజెన్స్ వర్గాలతో పాటు వివిధ సంస్థలతో ఎప్పటికప్పుడు ప్రజాభిప్రాయాన్ని తెలుసుకుంటోంది. టీడీపీ, కాంగ్రెస్‌లు కూడా తమ వ్యూహకర్తల పైనే ఎక్కువగా ఆధార పడుతున్నాయి. వారు ఇచ్చిన సర్వేల ఆధారంగానే హైకమాండ్ అభ్యర్థులను ఎంపిక చేసింది. గతంలో ఎప్పుడూ రాజకీయ పార్టీలు ఇంతలా సర్వేలపై ఆధారపడలేదు. పోటీ చేయాలనుకున్న కొందరు నేతలు మాత్రమే సర్వే చేయించుకునేవారు. ఎన్నికల్లో పోటీ అంటే కోట్ల రూపాయల ఖర్చుతో కూడుకున్న పని కావడంతో ముందుగా ఐదారు లక్షల రూపాయలతో సర్వే చేయించుకుని... తనకు గెలుపు అవకాశాలున్నాయంటేనే బరిలోకి దిగేవారు. కానీ ఈ సారి పార్టీలే సర్వేలు చేయిస్తున్నాయి.

అంతు చిక్కని ప్రజానాడి

ఈసారి సర్వేల్లో కూడా పూర్తి ఖచ్చితత్వంతో కూడిన అభిప్రాయాలు వెల్లడి కావడం లేదని ఆయా సంస్థలే చెబుతున్నాయి. క్షేత్రస్థాయిలో ప్రజానాడిని పట్టుకోలేకపోతున్నామని ఓ సర్వే సంస్థ ప్రతినిధి వెల్లడించాడు. ఓటర్లు మనసులో ఒక నిర్ణయంతో ఉండి.. పైకి మాత్రం మరోలా చెబుతున్నారని అంటున్నారు. అంతేకాకుండా తమ అభిప్రాయాన్ని స్పష్టంగా బయటపెడితే తమ ఉనికి ఎక్కడ బయటపడుతుందో, దానివల్ల మున్ముందు ఏ సమస్య వస్తుందోనన్న భయంతో కూడా సరైన సమాచారం ఇవ్వడం లేదంటున్నారు. ఓటర్లు చెప్పే దానికి... ఓటు వేసేవాడికి మధ్య కనీసం 25 శాతం తేడా ఉండే అవకాశాలు ఉన్నాయని సర్వే సంస్థలు చెబుతున్నాయి.

బెట్టింగుల కోసం..

ఏపీ ఎన్నికలపై బెట్టింగులు జరుగుతున్నట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో రెండోసారి వైసీపీ అధికారంలోకి వస్తుందా? లేక టీడీపీ అధికారంలోకి వస్తుందా? అన్న దానిపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. దీనిపై ఇప్పటికే పందెంరాయుళ్లు రంగంలోకి దిగి గెలిచే పార్టీ ఏదో తెలుసుకు నేందుకు సర్వే సంస్థల యజమానులను కలుస్తున్నట్లు సమాచారం. ఏజెన్సీలు ఇచ్చే నివేదికను బట్టి కోట్ల రూపాయల బెట్టింగులు జరగబోతున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు తెలంగాణకు చెందిన కొందరు బెట్టింగ్ రాయుళ్లు కూడా సర్వే సంస్థలను ఆశ్రయించినట్లు తెలుస్తోంది.

నెల రోజుల్లో తోటపల్లి నీరు

- పోలవరంతో పాటు సుజల స్రవంతి పనులు ప్రారంభిస్తాం
- అందరి ఆమోదంతో చీపురుపల్లికి మున్సిపాలిటీ హోదా
- ఆర్ఈసీఎస్ సేవలు ప్రారంభిస్తాం
- చీపురుపల్లి కూటమి అభ్యర్థి కిమిడి కళా వెంకటరావు

(చీపురుపల్లి)

'చీపురుపల్లి నియోజకవర్గ అభివృద్ధి కోసం ప్రత్యేక ప్రణాళికలు ఉన్నాయి. ప్రభుత్వపరంగా వచ్చే పథకాల తో పాటు ఇక్కడి ప్రజల కోసం ప్రత్యేకంగా ఆలోచిస్తా ను. గత ప్రభుత్వ నిర్లక్ష్యం, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడం వల్ల తోటపల్లి పనులు పూర్తి కాక, ఆయకట్టు పరిధిలోని రైతులు సుమారు రెండు వేల కోట్ల పంటను నష్టపోయారు. వారందరికీ న్యాయం చేయాలి. వెనుకబడిన ఈ ప్రాంతంలో పరిశ్రమలు ఏర్పాటు చేసి, నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలి. వీటన్నింటి పైనా దృష్టి పెడతాను.' అని చీపురుపల్లి ఉమ్మడి అభ్యర్థి కిమిడి కళా వెంకటరావు అన్నారు. ఆ విషయాలు ఆయన మాటల్లోనే...



చీపురుపల్లి నియోజకవర్గం కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కిమిడి కళా వెంకటరావు

సుజల స్రవంతి పనులు ప్రారంభిస్తాం

ఉత్తరాంధ్రకు సాగు, తాగు నీరందించే సుజల స్రవంతిని పూర్తి చేయడం చంద్రబాబు లక్ష్యం. రెండు వేల కోట్లతో ఈ పనులకు అప్పట్లో చంద్రబాబునాయుడు నర్సీపట్నం వద్ద శంకుస్థాపన చేశారు. ఆయన గెలిచి ముఖ్యమంత్రి అయిన వెంటనే పోలవరం పనులు జోరందుకుంటాయి. ఆ పనులతో పాటే సుజల స్రవంతి కూడా ప్రారంభించేలా ముఖ్యమంత్రితో మాట్లాడి ఒప్పిస్తాను.

నెల రోజుల్లో తోటపల్లి పనులు పూర్తి

తోటపల్లి కాలువల్లో పూడిక తీత పనులు పెండింగ్ లో ఉన్నాయి. గత పాలకులు వీటిని పట్టించుకోలేదు. అధికారంలోకి వచ్చిన వెంటనే కాలువల్లో పూడికతీత పనులు పూర్తి చేస్తాం. పెండింగ్‌లో ఉన్న పిల్ల కాలువ పనులన్నీ పూర్తి చేసి పూర్తి ఆయకట్టుకు నెల రోజుల్లో సాగు నీరందించే విధంగా కృషి చేస్తాను.

కొత్త పరిశ్రమల ఏర్పాటుకు కృషి

రాష్ట్రంలోని నిరుద్యోగ యువత కోసం ఏటా నాలుగు లక్షల ఉద్యోగాలు ఇస్తామని మా మేనిఫెస్టోలో ప్రకటించాం. ఖాళీ అయిన ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేస్తాం. ఇవి కాకుండా సాంకేతికతపై మా అధినేతకు విజన్, శ్రద్ధ ఉన్నాయి. వీటిని అందిపుచ్చుకొని చీపురుపల్లి నియోజకవర్గంలోని యువత కోసం స్థానికంగా పరిశ్రమల ఏర్పాటుకు నా వంతు కృషి చేస్తాను. గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా నియోజకవర్గంలో అసంపూర్తిగా ఉన్న పనులపై దృష్టి పెడతాను. చీపురుపల్లిలో అర్థాంతరంగా నిలిచిపోయిన ఇండోర్ స్టేడియం వంటి అసంపూర్తి నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేస్తాను.

ఆర్ఈసీఎస్ పునరుద్ధరణ

చీపురుపల్లి ఆర్ఈసీఎస్ సంస్థ బాగా పని చేస్తోంది. ఈ ప్రాంతానికి ప్రత్యేక గుర్తింపు తెచ్చిన చీపురుపల్లి గ్రామీణ విద్యుత్ సహకార సంఘం లిమిటెడ్‌ను మేం అధికారంలోకి రాగానే తిరిగి ప్రారంభిస్తాం. ఇక్కడి రైతులకు ఆ సంస్థ సేవలు కొనసాగేలా అన్ని చర్యలు తీసుకుంటాను. రెవెన్యూ డివిజన్‌గా ఉన్న చీపురుపల్లికి అన్ని శాఖల కార్యాలయాలు మంజూరు చేయించేందుకు ప్రయత్నిస్తాను. మా నాయకుడు చంద్రబాబుతో మాట్లాడి, రెవెన్యూ డివిజన్ ప్రధాన కేంద్రంలో ఏయే కార్యాలయాలు ఉండాలో అన్నీ ఏర్పాటు చేయిస్తాను. అన్ని కార్యాలయాలకు పక్కా భవనాలు కూడా మంజూరు చేయడానికి కృషి చేస్తాను.

అందరి ఆమోదంతోనే..

లయన్స్ క్లబ్ వంటి స్వచ్ఛంద సంస్థలు, ప్రజా సంఘాలు, రాజకీయ నాయకులు, పట్టణ పెద్దలు, ఇతర అన్ని వర్గాలతో చర్చించి, మెజారిటీ వర్గాల ఆమోదం మేరకు పట్టణానికి మున్సిపాలిటీ హోదాపై నిర్ణయం తీసుకుంటాను. అప్‌గ్రేడేషన్‌కు అందరూ అంగీకరిస్తారని నేను అనుకోవడం లేదు. అప్‌గ్రేడైతే ప్రజలపై పన్నుల భారం పడుతుందనేది ఒక అభిప్రాయం ఉంది. పక్కనే ఉన్న రాజాంలో కూడా మున్సిపాలిటీ హోదాపై భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. ఈ విషయంలో అందరి ఆమోదంతోనే నిర్ణయం తీసుకుంటాను.

ఊరూ.. వాడా.. కూటమి అభ్యర్థులే

సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లోని టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులు ఊరూ.. వాడా తిరుగుతూ విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. పల్లెలు, పట్టణాల్లో సుడిగాలి పర్యటనలు చేపడుతున్నారు. గురువారం వివిధ నియోజకవర్గాల అభ్యర్థులు ప్రచార కార్యక్రమాల్లో పాల్గొన్నారు. వీరి ప్రచారానికి జనం నుంచి మంచి స్పందన లభిస్తోంది.



పాలకొండ: మాట్లాడుతున్న హైపర్ ఆది, పక్కన జనసేన అభ్యర్థి జయకృష్ణ



నెల్లిమర్ల: ప్రచారంలో విజయనగరం కూటమి ఎంపీ అభ్యర్థి కలిశెట్టి అప్పలనాయుడు



పార్వతీపురం రూరల్: కూటమి అభ్యర్థి విజయచంద్రకు హారతి ఇస్తున్న మహిళలు



గుర్ల: చీపురుపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి కిమిడి కళా వెంకటరావు ప్రచారం



విజయనగరంలో ప్రచారం చేస్తున్న అదితి గజపతిరాజు



నెల్లిమర్ల: సారిపల్లి రోడ్‌షోలో మాట్లాడుతున్న కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి నాగమాధవి



మెంటాడ: సాలూరు ఎమ్మెల్యే అభ్యర్థి సంధ్యారాణికి మహిళల హారతులు



వంగర: ప్రచారంలో మాట్లాడుతున్న కొండ్రు మురళి



బొబ్బిలి: పక్కిలో ప్రచారం చేస్తున్న బేబీనాయన



టీడీపీలో నూతనోత్తేజం

కురుపాంలో చంద్రబాబు చేపట్టిన రోడ్ షోలో పాల్గొన్న ప్రజలు



కురుపాం: ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ ప్రతిని దహనం చేస్తున్న చంద్రబాబు



- కురుపాం సభకు భారీగా జనం
- ఉత్సాహంగా బాబు ప్రసంగం

గురుగుబిల్లి/కురుపాం: టీడీపీ అధినేత చంద్రబాబు ఎన్నికల సభకు నియోజకవర్గంలోని ఐదు మండలాల నుంచి 20 వేలకు పైగా ప్రజలు హాజరయ్యారు. టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలతో కురుపాం కిటకిటలాడింది. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఉదయం 11.30 గంటలకు బహిరంగ సభ జరగాల్సి ఉంది. కానీ మధ్యాహ్నం 1.50 గంటలకు సభా ప్రాంగణానికి చంద్రబాబు చేరుకున్నారు. సుమారు గంట సమయం పాటు ఉపన్యసించారు. ఎండను సైతం లెక్క చేయకుండా మూడు పార్టీల శ్రేణులు, కార్యకర్తలు తరలివచ్చారు. రహదారులన్నీ మూడు రంగుల జెండాలతో రెపరెపలాడాయి. కురుపాం, గుమ్మలక్ష్మీపురం, కొమరాడ, జియ్యమ్మవలస, గరుగుబిల్లి మండలాల నుంచి అధిక సంఖ్యలో పార్టీ శ్రేణులు తరలివచ్చారు. ప్రజాగళం సూపర్ సక్సెస్‌కు కారణమైన యువనేత, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వైరిచర్ల వీరేష్ చంద్రదేవ్‌ను టీడీపీ అధినేత అభినందించారు. కూటమి అభ్యర్థుల గెలుపు బాధ్యత తీసుకోవాలని అరకు తెలుగుదేశం పార్టీ బీసీ సెల్ అధికార ప్రతినిధి ద్వారపురెడ్డి సత్యనారాయణకు చంద్రబాబు సూచించారు.



గరుగుబిల్లి మండలం సంతోషపురానికి చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు ర్యాలీగా వస్తున్న దృశ్యం



కురుపాం బస్టాండ్ ఆవరణలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

ఆకట్టుకున్న ఫ్లెక్సీ

కురుపాం బస్టాండ్ ఆవరణలో గురువారం ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ ఎంతగానో ఆకట్టుకుంది. ఏపీకి డ్రైవర్ బాబు అనే పేరుతో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని అంతా ఆసక్తిగా తిలకించారు. బహిరంగ సభలో మాట్లాడుతున్న సమయంలో చంద్రబాబు ఆ ఫ్లెక్సీని చూసి రాష్ట్ర ప్రజలను సురక్షిత స్థానంలో ఉంచేందుకు ఏపీకీ డ్రైవర్‌ను తానేనని చిరునవ్వుతో అన్నారు.



చీపురుపల్లి మెయిన్ రోడ్డులో..

చంద్రబాబు పర్యటన ఇలా..

కొమరాడ, మే 9: తెలుగుదేశం జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం కురుపాంలో పర్యటించారు. స్థానిక బస్టాండ్ జంక్షన్ వద్ద బహిరంగ సభ నిర్వహించారు.

- మధ్యాహ్నం 1.28 గంటలకు కురుపాం సాయిబాబా గుడి ఎదురుగా ఉన్న హెలీపాడ్ వద్దకు చేరుకున్నారు.
- కురుపాం, పార్వతీపురం కూటమి అభ్యర్థులు తోయక జగదీశ్వరి, విజయచంద్ర, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వీరేష్ చంద్రదేవ్, దత్తి లక్ష్మణరావులు చంద్రబాబుకు స్వాగతం పలికారు.
- 1.35 గంటలకు హెలీపాడ్ నుంచి బహిరంగ సభా స్థలానికి బయలుదేరారు. ప్రజలకు అభివాదం చేస్తూ సాగారు.
- 2.50 గంటల వరకు సభలో ప్రసంగించారు.
- 2.55 గంటలకు హెలీపాడ్ వద్దకు బయలుదేరారు.
- 3.05 గంటలకు హెలీపాడ్‌కు చేరుకున్నారు.
- 3.15 గంలకు బస్సులో భోజనం చేశారు.
- 3.40 గంటలకు టీడీపీలో చేరిన పార్వతీపురం వైసీపీ నాయకులకు కండువాలు వేశారు.
- 4 గంటలకు కురుపాం నుంచి హెలీకాప్టర్‌లో చీపురుపల్లి బయలుదేరారు.
- భారీ జన సందోహంతో సభా ప్రాంగణం కిక్కిరిసిపోయింది.



చంద్రబాబుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న కురుపాం కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి తోయక జగదీశ్వరి, పక్కన అరకు కూటమి ఎంపీ అభ్యర్థి కొత్తపల్లి గీత



టీడీపీ అధినేతకు పుష్పగుచ్ఛం అందిస్తున్న పార్వతీపురం కూటమి అభ్యర్థి విజయచంద్ర

నృత్యాలతో సందడి

గుమ్మలక్ష్మీపురం: చంద్రబాబు రాక కోసం కురుపాంలో ప్రజలు, కూటమి శ్రేణులు ఓపిగ్గా ఎదురుచూశారు.

- టీడీపీ పాటలకు గిరిజన మహిళలు, యువత నాన్‌స్టాప్‌గా నృత్యాలు చేశారు.
- చంద్రబాబు తన ఉపన్యాసంలో పవన్‌కల్యాణ్ పేరు ప్రస్తావించినప్పుడల్లా యువత నుంచి పెద్ద ఎత్తున స్పందన వచ్చింది.
- చంద్రబాబు ప్రసంగిస్తున్న సమయంలో 108 వాహనం రావడంతో ఆయన స్పీచ్‌ను మధ్యలో ఆపేశారు. అంబులెన్స్‌కు దారి ఇమ్మని పోలీసులు, ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఆ తర్వాత ఆయన ప్రసంగాన్ని ప్రారంభించారు.
- ఆ సమావేశం సమయంలో మూడుసార్లు అటువైపుగా 108 వాహనం తిరగడం సందేహాలకు తావిచ్చింది.

టీడీపీలో చేరిన జయబాబు

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి, మే 9: పార్వతీపురం నియోజకవర్గంలో వైసీపీకి గట్టి షాక్ తగిలింది. మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్, వైసీపీ నాయకుడు బెలగాం జయప్రకాష్ నారాయణ (జయబాబు)... టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు సమక్షంలో గురువారం ఆ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. కురుపాంలో జరిగిన ప్రజాగళం కార్యక్రమంలో జయబాబు తన అనుచరులతో కలసి టీడీపీలో చేరారు. టీడీపీలో చేరిన వారిలో ఆయన అనుచరులు సయ్యద్ ఇబ్రహీమ్ ఉసేన్(సునీల్), వ్యాపారవేత్తలు చెక్క లచ్చయ్య, బుడ్డేపు రామకృష్ణ, కె.ప్రసాద్, వైశ్యరాజు శ్రీనివాస రాజు, పి.రాంబాబు, కలమల కుమార్, జాగాన భాస్కరరావు, నాగేంద్ర, కోఆప్షన్ మెంబర్ క్రాంతికుమార్ తదితరులు ఉన్నారు.



చంద్రబాబు సమక్షంలో తన అనుచరులతో చేరిన జయబాబు



చీపురుపల్లి పట్టణంలో..



చీపురుపల్లిలో ప్లకార్డుతో దివ్యాంగుడు



చీపురుపల్లి రోడ్డులో ఓ షాపింగ్ కాంప్లెక్స్ పైకెక్కి చంద్రబాబు ప్రసంగాన్ని వింటున్న యువత

చీపురుపల్లిలో ఇలా..

గరివిడి, మే 9: చీపురుపల్లిలో చంద్రబాబు మాట్లాడుతూ నియోజకవర్గంలో మూసి ఉన్న ఫెర్రో ఎల్లాయిస్ పరిశ్రమలు తెరిపిస్తామని హామీ ఇచ్చారు.

- చీపురుపల్లి నియోజకవర్గంలో పాడైన తారు రోడ్లన్నిటికీ మరమ్మతులు చేయిస్తామన్నారు.
- చీపురుపల్లి నియోజకవర్గం గంజాయికి అడ్డాగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు.
- టీడీపీ జిల్లా ఇంఛార్జ్ కిమిడి నాగార్జున రాజకీయ భవిష్యత్తుకు తనది హామీ అని భరోసా ఇచ్చారు.
- చంద్రబాబు నాయుడు ప్రసంగాన్ని వినడానికి మహిళలు, యువత పెద్ద ఎత్తున షాపింగ్ కాంప్లెక్స్‌ల పైకి ఎక్కారు.



కురుపాం: చంద్రబాబుతో అరకు టీడీపీ బీసీ సెల్ అధికార ప్రతినిధి సత్యనారాయణ



చీపురుపల్లి: నృత్యం చేస్తున్న టీడీపీ అభిమానులు



చీపురుపల్లి మెయిన్ రోడ్డులో జన సందోహం

నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తా: జయకృష్ణ


పార్టీలో చేరినవారిని ఆహ్వానిస్తున్న జయకృష్ణ

పాలకొండ: తనకు ఒక్కసారి అవకాశం ఇస్తే నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి నిమ్మక జయకృష్ణ కోరారు. గురువారం ఆయనకు మద్దతుగా ప్రముఖ సినీనటుడు షైపర్ ఆది పాలకొండ పట్టణంలో ప్రచారం చేశారు. ఈసందర్భంగా ఆది మాట్లాడుతూ మూడు వేల మంది కౌలు రైతులకు తన జేబులోని డబ్బు ఖర్చుపెట్టిన పవన్‌కళ్యాణ్ ఈ ప్రభుత్వంలా మీ జేబులోని డబ్బులకు ఆశపడే వ్యక్తి కాదన్నారు. టీడీపీ నాయకులు కర్నేన అప్పలనాయుడు, గంటా సంతోష్ కుమార్, గండి రామినాయుడు, వెన్నపు శ్రీనివాసరావు, కోట సంగంనాయుడు, తేజోవతి, జనసేన నాయకులు పాలవలస యశస్వి, కొరికాన రవికుమార్, గర్భాన సత్తిబాబు, నిమ్మల నిబ్రం, బీజేపీ నాయకులు తాడంగి సునీత పాల్గొన్నారు. ● వైసీపీ పట్టణ కౌన్సిలర్ (నాలుగో వార్డు) కొరికాన గంగునాయుడు జనసేనలో చేరారు. ఆయనకు జయకృష్ణ కండువా కప్పి, పార్టీలోకి ఆహ్వానించారు. ● **వీరఘట్టం:** వీరఘట్టంలో గురువారం సినీనటుడు షైపర్ ఆది రోడ్‌షో నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో మాటలు ఎక్కువ.. అభివృద్ధి తక్కువ అని ఎద్దేవా చేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు ఉదాయన ఉదయ్‌భాస్కర్, జామి లక్ష్మీనారాయణ, బళ్ల హరి, మహేష్ తదితరులు పాల్గొన్నారు. ● మెట్టవెంకటాపురంలో వైసీపీకి చెందిన ఎస్.జగన్నాథం, ఎస్.కృష్ణ, బి.అప్పలనాయుడు, ఎస్.రానా, ఎస్.సంగంనాయుడు, వై.అక్కలనాయుడుతో పాటు 15 కుటుంబాలు జనసేనలో చేరాయి. వారికి ఎమ్మెల్యే అభ్యర్థి నిమ్మక జయకృష్ణ పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. ఉదయాన ఉదయ్‌భాస్కర్, మాచర్ల అనీల్, లింగాల చంటి పాల్గొన్నారు. ● **భామిని:** కూటమి అభ్యర్థి జయకృష్ణకు ఒక్క అవకాశం ఇవ్వాలని తన సోదరుడు నిమ్మక పాండు అభ్యర్థించారు. సతివాడ, పోలవరం, పెద్దదిమిలి గ్రామాల్లో ప్రచారం చేశారు. సతివాడలో నులకజోడు ఎంపీటీసీ బోసు బాలకృష్ణతో పాటు పదిమందికి టీడీపీలోకి ఆహ్వానించారు. పెద్దదిమిలిలో పలువురు జనసేనలో చేరారు. మాజీ ఎంపీపీ కేశవ, రవినాయుడు, సంజీవి పాల్గొన్నారు.

వైసీపీకి తగిన గుణపాఠం చెప్పండి

● కూటమి పార్వతీపురం ఎమ్మెల్యే అభ్యర్థి విజయచంద్ర


విజయ సంకేతం చూపిస్తున్న కూటమి అభ్యర్థి విజయచంద్ర

పార్వతీపురం రూరల్: వచ్చే ఎన్నికల్లో వైసీపీని చిత్తుచిత్తుగా ఓడించి, తగిన గుణపాఠం చెప్పాలని కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి బోనెల విజయచంద్ర ఓటర్లను కోరారు. మండలంలోని జమదాల తదితర గ్రామాల్లో గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారంలో ఆయనకు అపూర్వ స్వాగతం లభించింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ కాలంలో అంతా అవినీతి పాలన జరిగిందన్నారు. మరికొద్ది రోజుల్లో దోపిడీ ప్రభుత్వం పోతుందన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ కూటమి అభ్యర్థిగా తనకు సైకిల్ గుర్తుపై, అరకు ఎంపీగా బీజేపీ నుంచి పోటీ చేస్తున్న కొత్తపల్లి గీతకు కమలం గుర్తుపై ఓట్లు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జి.వెంకటనాయుడు, బోనుదేవి చంద్రమౌళి, మాజీ జడ్పీటీసీ గౌరీశ్వరితోపాటు వివిధ గ్రామాలకు చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థులను గెలిపించాలని బైకు ర్యాలీ

పార్వతీపురంటౌన్: ఎన్డీయే కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ గురువారం స్థానిక ఏఎంసీ వద్ద నుంచి వైకేఎం కాలనీ వరకు టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు బైకు ర్యాలీ చేశారు. ఈ ర్యాలీని ఆ పార్టీ సీనియర్ నాయకుడు బార్నాల సీతారామ్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీలో వైసీపీ నుంచి టీడీపీలో చేరిన మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ బెలగాం జయప్రకాష్ నారాయణ మాట్లాడుతూ కూటమి అభ్యర్థుల గెలుపుతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమన్నారు. పార్టీ నాయకులు జి.రవికుమార్, పి.రాజశేఖర్, కె.నారాయణరావు, తదితరులు పాల్గొన్నారు.

కూటమి మేనిఫెస్టోతో అన్నివర్గాలకు మేలు

● సాలూరు ఎమ్మెల్యే అభ్యర్థి సంధ్యారాణి


ప్రచారంలో మాట్లాడుతున్న సంధ్యారాణి

మెంటాడ: టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రకటించిన మేనిఫెస్టో రాష్ట్రంలోని అన్నివర్గాలకూ మేలు చేకూరుస్తుందని సాలూరు ఎమ్మెల్యే అభ్యర్థి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. మండలంలోని రాబంద, మీసాలపేట, చల్లపేట, ఆంధ్ర, లోతుగెడ్డ, జయతి, ఇప్పలవలస, పిట్టాడ, మెంటాడ గ్రామాల్లో ఆమె గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర భవిష్యత్తును నిర్ణయించే ఈ ఎన్నికల్లో ప్రతిఒక్కరూ విజ్ఞతతో ఓటు హక్కు వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. అన్ని గ్రామాల్లో ఆమెకు ఘన స్వాగతం లభించింది. రాజన్నదొర ఎమ్మెల్యేగా, మంత్రిగా ఈ నియోజకవర్గానికి ఏం చేశారో చెప్పాలని ప్రశ్నించారు. తనకు అవకాశం ఇస్తే అభివృద్ధి అంటే ఎంటో చూపిస్తానని హామీ ఇచ్చారు. ప్రతిఒక్కరూ సైకిల్ గుర్తుపై ఓటువేసి, తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని ఆమె కోరారు. అలాగే అరకు ఎంపీ అభ్యర్థి కొత్తపల్లి గీతకు కమలం గుర్తుపై ఓటు వేసి, గెలిపించాలని కోరారు. కూటమి విజయంతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమన్నారు. ఈ ప్రచారంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థులను గెలిపించాలి

మక్కువ: కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గుమ్మిడి సంధ్యారాణి, ఎంపీ అభ్యర్థి కొత్తపల్లి గీతలను గెలిపించాలని కోరుతూ మార్కొండపుట్టి, గోపాలపురం గ్రామాల్లో టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు పెంట తిరుపతిరావు, పార్టీ నాయకుడు మావుడి ప్రసాదరావు గురువారం ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకుడు చొక్కాపు బుచ్చినాయుడు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిక


పార్టీలో చేరినవారితో శత్రుచర్ల

జియ్యమ్మవలస: తొడుము పంచాయతీ నుంచి, కొట్టు పంచాయతీ రాయిపురం నుంచి 70 కుటుంబాలు వైసీపీని వదిలి టీడీపీలో చేరాయి. మాజీ మంత్రి శత్రుచర్ల విజయరామరాజు సమక్షంలో గురువారం వారంతా టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. పార్టీలో చేరినవారిలో తొడుము మాజీ సర్పంచ్ ఎల్.శ్రీనివాసరావు, రాయిపురం గ్రామ నాయకుడు నగిరెడ్డి బలరాంనాయుడు తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు ఎం.శ్రీధర్, ఎస్.కోటేశ్వరరావు, ఎస్.గుంపస్వామి, కె.నీలంనాయుడు, ఎం.గౌరునాయుడు పాల్గొన్నారు.

కూటమికి డిగ్రీ కళాశాలల యాజమాన్యం మద్దతు

పాలకొండ: ఆంధ్రప్రదేశ్ ప్రైవేటు డిగ్రీ కళాశాలల యాజమాన్యం అసోసియేషన్ ఏకగ్రీవంగా ఎన్డీఏ కూటమికి మద్దతు ప్రకటించాయి. గురువారం సాయంత్రం పాలకొండలోని ఓ ప్రైవేటు డిగ్రీ కళాశాలలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ప్రైవేటు డిగ్రీ కళాశాల అసోసియేషన్ రాష్ట్ర నాయకులు వెంకట్ రెడ్డి, రమణారెడ్డి, ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు జయరాం పాల్గొన్నారు. వైసీపీ ప్రభుత్వం ప్రైవేటు డిగ్రీ కళాశాలలను నిర్వీర్యం చేసిందని, దీంతో కళాశాలలు నష్టాల్లో కూరుకుపోయాయని వాపోయారు. ఈ కార్యక్రమంలో పాలకొండలో ఉన్న అన్ని ప్రైవేటు డిగ్రీ కళాశాలల యాజమాన్యాలు పాల్గొన్నారు.

'పార్టీని వీడేదిలేదు'

పార్వతీపురంటౌన్: కొంతమంది తనపై దుష్ప్రచారం చేస్తున్నారని, టీడీపీని వీడేదిలేదని 17వ వార్డు కౌన్సిలర్ తాతపూడి వెంకటరమణ స్పష్టంచేశారు. గురువారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. ఒక దినపత్రికలో తనతో పాటు కొంతమంది అనుయాయులు పార్టీని వీడుతున్నట్టు ప్రచారం చేయడం సరికాదన్నారు. బంగారమ్మ కాలనీ ప్రజలకు ఎళ్లవేళలా సేవ చేయడం తన కార్తవ్యమని, డబ్బు కోసం వైసీపీలో చేరే అవకాశమే లేదని తేల్చిచెప్పారు. తన జీవితం టీడీపీ బలోపేతానికి, గెలుపునకే అంకితం చేస్తానని చెప్పారు. ఈనెల 6వ తేదీన తమ వార్డులో టీడీపీ తరపున భారీ ర్యాలీ నిర్వహించినందుకు వైసీపీ నాయకులు తనపై కక్షకట్టి దుష్ప్రచారం చేస్తుండడం దురదృష్టకరమన్నారు.

ఈదురు గాలుల బీభత్సం

● జిల్లాలో కురిసిన వర్షం ● పలుచోట్ల నేలకొరిగిన చెట్లు

సీతానగరం: జిల్లా వ్యాప్తంగా గురువారం అక్కడక్కడ ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. మండలంలో గాలీ వాన బీభత్సానికి చినరాయుడుపేట గ్రామ సమీపంలో 36వ రాష్ట్ర రహదారిపై భారీ చింతచెట్టు రోడ్డుకు అడ్డంగా పడింది. అదృష్టవశాత్తు ఎవరికీ ఎటువంటి ప్రాణాపాయం జరగలేదు. ఇన్‌చార్జి ఎస్‌ఐ వి.పాపారావు క్రేన్ సహాయంతో ఆ చెట్టును రోడ్డుపై నుంచి తొలగింపజేశారు. గ్రామస్థులు సహకరించారు. ● **పార్వతీపురంటౌన్:** జిల్లా కేంద్రంలో గురువారం ఈదురు గాలులతో తేలికపాటి జల్లులు కురిసాయి. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. ● **సాలూరు రూరల్:** సాలూరు ఏజెన్సీలో గురువారం సాయంత్రం వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. సాలూరు అర్బన్, రూరల్, పరిసర మండలాల్లో భారీ వర్షం కురిసింది. ● **భామిని:** మండల వ్యాప్తంగా గురువారం వర్షం కురవడంతో ప్రజలు ఉపశమనం పొందారు. ● **మక్కువ:** మండలంలో గురువారం సాయంత్రం ఉరుములు, ఈదురు గాలులు, మెరుపులతో మోస్తరు వర్షం కురిసింది. ఈదురు గాలుల ప్రభావంతో కొన్నిచోట్ల చెట్లు నేలకొరిగాయి. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. తక్షణమే విద్యుత్ సిబ్బంది స్పందించి విద్యుత్‌ను పునరుద్ధరించడంతో కొంతమేర అవస్థలు తగ్గాయి. ● **వీరఘట్టం:** మండలంలోని వీరఘట్టం పరిసర ప్రాంతాల్లో గురువారం సాయంత్రం వర్షం కురిసింది.


సీతానగరం: నేలకొరిగిన చెట్టును తొలగింపజేస్తున్న ఎస్‌ఐ పాపారావు


భామినిలో కురుస్తున్న వర్షం


మక్కువ: ఈదురు గాలులకు విరిగిన చెట్ల కొమ్మలు


సాలూరు రూరల్: సాలూరులో..

సౌకర్యాల కల్పనపై దృష్టి సారించాలి


గిజబలో మస్తర్లను పరిశీలిస్తున్న సన్యాసిరాజు

గరుగుబిల్లి: ఉపాధి హామీ పనులు నిర్వహించే ప్రాంతాల్లో వేతనదారులకు విధిగా అవసరమైన సౌకర్యాలు కల్పించాలని జిల్లా అంబుడ్స్‌మెన్ జడ్డి కె.సన్యాసిరాజు సూచించారు. గిజబ ప్రాంతంలో నిర్వహిస్తున్న ఉపాధి పనులను ఆయన గురువారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత వేసవిలో వడదెబ్బకు గురికాకుండా ఉండేందుకు టెంట్లు, వైద్య సామగ్రి, తాగునీరు, తదితర వాటిని అందుబాటులో ఉంచాలన్నారు. వేతనదారులకు ముందస్తు కొలతలు అందిస్తే వేతనం గిట్టుబాటయ్యే అవకాశం ఉంటుందన్నారు. రోజుకు రూ.300 కూలి గిట్టుబాటు అయ్యేలా పనులు చేయాలని వేతనదారులకు సూచించారు. ఈ పరిశీలనలో క్షేత్ర సహాయకులు ఎం.పకీరునాయుడు, మేట్లు రామలక్ష్మి, హైమా, జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

పిడుగు పాటుకు మహిళ మృతి

వంగర: బంగారువలస గ్రామానికి చెందిన బొరోతు సత్తెమ్మ గురువారం రాత్రి పిడుగు పాటుకు గురై మృతిచెందింది. గ్రామ సమీపానగల పశువుల శాలకు వెళ్లిన ఆమె.. వర్షం వస్తుందని గమనించి ఇంటికి వెళ్లేందుకు ప్రయత్నించగా, ఒక్కసారిగా పెద్దశబ్దంతో పిడుగు పడింది. దీంతో ఆమె అక్కడికక్కడే మృతిచెందింది. మృతురాలికి భర్త గంగరాజు, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

చంద్రబాబు సభ విజయవంతం చేసిన అభిమానులకు కృతజ్ఞతలు

గుమ్మలక్ష్మీపురం: కురుపాంలో గురువారం జరిగిన చంద్రబాబు సభను విజయవంతం చేసిన కూటమి నాయకులు, అభిమానులు, కార్యకర్తలకు కురుపాం ఎమ్మెల్యే అభ్యర్థి తోయక జగదీశ్వరి ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. తనకు పూర్తి స్థాయిలో సహకరిస్తున్న నాయకులు, కార్యకర్తలకు హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తున్నానని ఆమె చెప్పారు.

సీపీఎం ప్రచారం

పాలకొండ: ఈనెల 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించాలని సీపీఎం నేత దావాల రమణారావు కోరారు. పట్టణంలో ఇంటింటా ప్రచారం గురువారం నిర్వహించారు. సీపీఎం అరకు ఎంపీ అభ్యర్థి పాచిపెంట అప్పలనర్స, కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి సవర చంటిబాబును గెలిపించాలని కోరారు.

బెల్ట్ షాపులపై దాడి

గుమ్మలక్ష్మీపురం/కురుపాం: గుమ్మలక్ష్మీపురం మండలం ఇరిడి గ్రామంలో జిల్లా టాస్క్ ఫోర్స్ అధికారులు గురువారం బెల్ట్ షాపులపై దాడులు చేశారు. ఈ దాడుల్లో ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి నుంచి 269 ఒడిశా మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. ఈ దాడులలో సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ షరీఫ్, సిబ్బంది పాల్గొన్నారు.


ఒడిశా మద్యం స్వాధీనం చేసుకున్న పోలీసులు

DECLARATION ABOUT CRIMINAL CASES

As per the judgment dated 25th September, 2018, of Hon'ble Supreme Court in WP (Civil) No. 536 of 2011 (Public Interest & Ors, Vs. Union of India)

Name and address of candidate:
Sri. **NIMMAKA JAYAKRISHNA** S/o Late Gopalrao, Mokasa Rajapuram, Veeraghattam Mandal, Parvathipuram manyam District. Pin-532460
Name of political party: **JANASENA**
Name of Election: **ASSEMBLY CONSTITUENCY**
(Assembly General Election – 2024)
Name of Constituency: **10- PALAKONDA (ST)**

I, **NIMMAKA JAYAKRISHNA** S/o Late Gopalrao, Aged-45years, Mokasa Rajapuram, Veeraghattam Mandal, Parvathipuram manyam District. Pin-532460 Andhra Pradesh State. a candidate for the above-mentioned election, declare for public information the following details about my Criminal antecedents:

Sl. NO.	Name of the PS	RTI information Shouted by	Applicant involved in Cr.No.&Sec	Stage of the case
1.	Palakonda	nimmaka jayakrishna S/o Late Gopalrao	239/2021 U/s 151 Cr.P.S	Bound over before the MEM court
2.	Veera ghattam	nimmaka jayakrishna S/o Late Gopalrao	Cr.No. 114/2023 U/s 151 Cr.P.S	Bound over before the MEM court
3.	Veera ghattam	nimmaka jayakrishna S/o Late Gopalrao	Cr.No. 116/2023 U/s 151 Cr.P.S	Bound over before the MEM court
4.	Veera ghattam	nimmaka jayakrishna S/o Late Gopalrao	Cr.No. 118/2023 U/s 151 Cr.P.S	Bound over before the MEM court
5.	Seetham peta	nimmaka jayakrishna S/o Late Gopalrao	82/2023 u/s 143,353,506 r/w 149 IPC	PT vide CC No. 811/2023
6.	Palakonda	nimmaka jayakrishna S/o Late Gopalrao	Cr.No. 88/2024 u/s188 of IPC	

In the case of election to Council of States Mention the election Concerned in place of Name of Constituency.

Sri. **NIMMAKA JAYAKRISHNA** S/o Late Gopalrao, 10-PALAKONDA (ST), ASSEMBLY CONSTITUENCY CANDIDATE

DECLARATION ABOUT CRIMINAL CASES

As per the judgment dated 25th September, 2018, of Hon'ble Supreme Court in WP (Civil) No. 536 of 2011 (Public Interest & Ors, Vs. Union of India)

Name and address of candidate:
Smt. **JAGADEESWARI THOYAKA** W/o Sanyasinaidu Addukula, Door No. 1-47, Main Street, Tadikonda Village, Gummalakshmipuram Mandal, Kurupam Assembly Constituency, Parvathipuram Manyam District, PIN CODE: 535 523, A.P STATE.
Name of political party: **TELUGU DESAM**
Name of Election: **ASSEMBLY CONSTITUENCY**
(Assembly General Election – 2024)
Name of Constituency: **11- KURUPAM (ST)**

I **JAGADEESWARI THOYAKA** W/o SANYASINAIDU ADDUKULA, Aged: 39 years, Door No. 1-47, Main Street, Tadikonda Village, Gummalakshmipuram Mandal, Parvathipuram Manyam District, Andhra Pradesh State: 535 523 a candidate for the above-mentioned election, declare for public information the following details about my Criminal antecedents:

Sl. NO.	Pending criminal cases			Details about cases of conviction for criminal offences	
	Name of Court	Case No. and status of case	Section (s) of Acts concerned & brief description of offence (s)	Name of Court & Date(s) of order (s)	Description of Offence (s) punishment imposed
1.	Not Applicable	FIR No. 99/2023 of Elwinpeta Police Station	Section. 151 of Cr.P.C. (The Arrest to Prevent the commission of cognizable offences)	Not Applicable	Not Applicable
2.	Not Applicable	FIR No. 100/2023 of Elwinpeta Police Station	Section. 151 of Cr.P.C. (The Arrest to Prevent the commission of cognizable offences)	Not Applicable	Not Applicable
3.	Not Applicable	FIR No. 101/2023 of Elwinpeta Police Station	Section. 151 of Cr.P.C. (The Arrest to Prevent the commission of cognizable offences)	Not Applicable	Not Applicable

In the case of election to Council of States Mention the election Concerned in place of Name of Constituency.

Smt. **JAGADEESWARI THOYAKA** W/o SANYASINAIDU ADDUKULA
11- KURUPAM (ST), ASSEMBLY CONSTITUENCY CANDIDATE